క్లుప్తంగా

వ్యాయామంతోనే ఆరోగ్యం

మహబూబాబాద్ అర్బన్: వ్యాయామంతో ఆరోగ్యంగా ఉంటామని వైద్యురాలు బండి రాధికరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వీరన్న, జోన్ చైర్మన్ మాధవ పెద్ది వెంకట్‌రెడ్డి, కార్యదర్శి పర్కాల రవీందర్ రెడ్డి, కోశాధికారి కరుణాకర్‌రెడ్డి, సభ్యులు వెంకటేశ్వర్లు, జగన్మోహన్‌రావు, అంజయ్య, నాగేశ్వర్‌రావు, కాశీనాథ్, రమేష్, సుధాకర్, బొడ్డుపల్లి ఉపేంద్రం పాల్గొన్నారు.

అన్నపూర్ణ పురస్కారం అందజేత



కేసముద్రం: పదిహేనేళ్లుగా అయ్యప్ప మాలధారణ స్వాములకు అన్నప్రసాద వితరణ చేస్తున్న కేసముద్రం అన్నదాన సేవా సొసైటీకి.. మహాశాస్త్ర సేవా ట్రస్ట్ హైదరాబాద్ డాక్టర్ సుధగాని రాజుగౌడ్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ పురస్కారం 2025ను శనివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వోలం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పోలెపల్లి యాకుబ్‌రెడ్డి, కోశాధికారి బోగోజు నాగేశ్వరాచారి, ఆలయ ధర్మకర్త చింతా నాగేశ్వర్ రావు, వాంకుడోతు బిచ్చానాయక్, చింత సాయి, తదితరులు పాల్గొన్నారు.

విజయ దశమి అవార్డు..

తొర్రూరు: డివిజన్ కేంద్రానికి చెందిన ప్రముఖ ఈవెంట్ ఆర్గనైజర్ పారిపల్లి శ్రావణ్‌కుమార్‌కు విజయదశమి అవార్డును భువన సుస్వర మ్యూజిక్ అకాడమి హన్మకొండ వారి ఆధ్వర్యంలో శనివారం అందించారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత

కురవి: ఆటోలో పోగొట్టుకున్న బ్యాగును సాంకేతిక ఆధారంతో ఆటోను పట్టుకుని అందులో ఉన్న బ్యాగును కురవి పోలీసులు బాధితురాలికి అందించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ నగరంలోని శివనగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ సహనాబేగం తన ఇద్దరు మనవరాళ్లతో కలిసి మహబూబాబాద్‌కు వచ్చింది. ఇంటికి వెళ్లిన తర్వాత ఆమె తన బ్యాగును ఆటోలో మర్చిపోయిన విషయాన్ని గమనించింది. వెంటనే కురవి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించింది. సెకండ్ ఎస్సై జయకుమార్, కానిస్టేబుళ్లు అనిత, రమేష్ ఆటోను గుర్తించి, అందులో ఉన్న బ్యాగును బాధితురాలికి అప్పగించారు. బ్యాగులో తులం బంగారం, రెండు స్మార్ట్ సెల్‌ఫోన్లు ఉన్నాయి.

శ్రమిస్తేనే ఉత్తమ ఫలితాలు

మహబూబాబాద్ అర్బన్: శ్రమిస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందవచ్చని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వివిధ స్థాయిలో ప్రతిభ సాధించిన అభ్యర్థులను వాకర్స్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కోశాధికారి విష్ణువర్ధన్, సలహాదారులు మైస శ్రీనివాసులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దంతాలపల్లి: మండలంలోని బొడ్లాడ గ్రామంలోని ముదిరాజ్ కులదైవ ఆలయ నిర్మాణానికి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ రూ.50వేల విరాళం శనివారం అందించారు. అలాగే గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు శంకరబోయిన సురేందర్ రూ.50వేలు అందించారు.

దాడి కేసులో పలువురి అరెస్టు

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని నిర్మల ఆస్పత్రిపై దాడి చేసిన కేసులో పలువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.శనివారం ఆయన మాట్లాడుతూ.. వెంకటాపురం గ్రామానికి చెందిన నలమాస ప్రశాంత్ అనే వ్యక్తి బైక్‌పై నుంచి పడి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కోసం నిర్మల ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవడంలో గొడవ పడగా, వీరితోపాటు నలమాస గణేష్, మొగుళ్ల సంపత్, వంగ గణేష్‌లు కలిసి ఆస్పత్రి యజమాన్యంతో గొడవ పడి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో ముత్తినేని నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సంబంధిత వ్యక్తులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల భద్రత పట్టదా?

- రక్షణ కవచాలు లేకుండా డ్రెయినేజీలు శుభ్రం
- అనారోగ్యం బారిన పడే అవకాశం

గూడూరు: పారిశుద్ధ్య కార్మికులు గ్రామాల్లో ప్రజారోగ్యం, పరిశుభ్రతను పరిరక్షించేందుకు అవసరమైన ప్రజాసేవను అందిస్తారు. ప్రతీరోజు కోడి కూయంగానే లేచి గ్రామాల శుభ్రత కోసం పాటుపడతారు. అలాంటి వారికి భద్రత కరువైంది. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త ఎత్తడం, మురుగు కాల్వలు శుభ్రపరచడం, ప్రజలు లేవకముందే వీధులన్నింటినీ శుభ్రం చేస్తున్న సఫాయి కార్మికుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోంది. అధికారులు వారితో కనీస జాగ్రత్తలు లేకుండా పనులు చేయిస్తున్నారు. అసలే వానాకాలం కావడంతో మురుగు పనులతో అనారోగ్యం బారినపడే అవకాశాలు ఉన్నాయని కార్మికులు వాపోతున్నారు. మండలంలోని 41 గ్రామపంచాయతీలలో 155 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. సమాజం సజావుగా పనిచేయడానికి కీలక పాత్ర పోషించే వారికి, ప్రభుత్వం అతితక్కువ వేతనాలు ఇస్తుండగా, సమాజంలో తగినంత గౌరవం, గుర్తింపు పొందడం లేదు.



ఎలాంటి రక్షణ కవచాలు లేకుండా డ్రెయినేజీ శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మానుకోట జిల్లా మొత్తం జీపీలలోని పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితి ఇదే విధంగా ఉందని, జీపీ కార్మిక సంఘం నాయకులు చెబుతున్నారు.

ఏడాదికి రెండు జతలు..

పారిశుద్ధ్య కార్మికులు చెత్త, మురుగుతో అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం ఆరోగ్య పరిరక్షణ కిట్లు ఇవ్వాలని గతంలో ఆదేశించింది. వారికి ఏడాదిలో కనీసం రెండు జతల యూనిఫాం, రెండు జతల షూ, చేతి గ్లౌజులు, మాస్కులు, సబ్బులు, శానిటైజర్లు రక్షణ కవచాలు అందించి, ప్రతీ మూడు, నాలుగు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించాలి. కానీ అధికారుల అలసత్వం కారణంగా వారి ద్వారా పనులు చేయిస్తున్నారే తప్ప, ఆరోగ్యం గూర్చి పట్టించుకోవడంలేదనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు గత ఆరు నెలలుగా ఎలాంటి రక్షణ కవచాలు అందించడం లేదు. ఇప్పటికైనా పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం, ఉన్నతాధికారులు వారికి జీతభత్యాలు పెంచడంతోపాటు భద్రత కిట్లు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కిట్లు అందిస్తాం..

గ్రామపంచాయతీలలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులందరికీ యూనిఫాం, గ్లౌజ్‌లు, షూ, సబ్బుల కిట్లు ఇవ్వాలని కార్యదర్శులకు సూచించాం. ఇటీవల కొంత ఆలస్యమైంది. మండల జీపీ కార్మికులందరికీ ఆరోగ్య బీమా చేయించాం. ఎలాంటి అనారోగ్యం కల్గినా సీహెచ్‌సీలో వైద్యం తీసుకోవాలని తెలిపాం.

\- సత్యనారాయణ, ఎంపీఓ, గూడూరు

కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలి

- మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని అరిపిరాల, వెలికట్ట గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను చైతన్యం చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశాల్లో మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, తూర్పాటి అంజయ్య, మంగళపల్లి శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

పెద్దవంగర: ప్రతి కార్యకర్త ఏకమైతే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు ఖాయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు పార్టీలో చేరగా ఆయన బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు. కార్యక్రమంలో రామచంద్రయ్య శర్మ, పాలకుర్తి యాదగిరి రావు, శ్రీరాం సుధీర్, సమ్మయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి



తొర్రూరు రూరల్: మాట్లాడుతున్న దయాకర్‌రావు

కురవి: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శనివారం సీరోలు మండల కేంద్రంలో మండల బీఆర్‌ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. కార్యక్రమంలో నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, దొంగరి నర్సయ్య, కొండపల్లి శ్రీదేవి, తేజావత్ బోజ్యానాయక్, గుగులోత్ రవినాయక్ పాల్గొన్నారు.

బాకీ కార్డుతో ప్రజలు ప్రశ్నించాలి

కొత్తగూడ: హామీలతో అధికారంలోకి వచ్చిన అధికార పార్టీ నాయకులను రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బాకీ కార్డులతో ప్రశ్నించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు సూచించారు. మండలకేంద్రంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, నెహ్రూ నాయక్, శ్యామల, కిషన్, రాములు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

కేసముద్రం: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటడానికి, పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కేసముద్రం పట్టణంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ అధ్యక్షతన జరిగిన స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మేరెడ్డి సురేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల నర్సింహ రెడ్డి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ తుంపిళ్ల శ్రీనివాస్, బోనగిరి ఉపేందర్, రామడుగు వెంకటాచారి, బోగోజు నాగేశ్వరాచారి పాల్గొన్నారు.

పథకాలకు విస్తృతంగా ప్రచారం చేయాలి

డోర్నకల్/నర్సింహులపేట: కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్ కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గణేష్‌నాయక్, పట్టణ అధ్యక్షులు దేవానాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి, సతీష్, అశోక్, బాసాని నాగేశ్వర్‌రావు, రెహమాన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కేసముద్రం: మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

గార్ల: స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ జిల్లా కార్యదర్శి సింగారపు సతీష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నక్క శివకృష్ణ, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి విమల్‌జైన్, తోడేటి నాగరాజు, జశ్వంత్‌ఠాగూర్, సాయికృష్ణ, జక్క సత్యనారాయణ, మచ్చ విజయ్ పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించండి

కేసముద్రం: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం తరఫున నిలబడిన అభ్యర్థులను గెలిపించాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆకుల రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మార్తనేని పాపారావు, గొడిశాల వెంకన్న, చాగంటి కిషన్, మోడెం వెంకటేశ్వర్లు, నీరుటి జలేందర్, సావిత్ర, జల్లె జయరాజ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి

కురవి: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం అయ్యగారిపల్లి గ్రామంలో పార్టీ సమావేశం జరిగింది. సరైన అభ్యర్థులను పోటీలో నిలపాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, బొల్లు వెంకన్న, కందుల యాకయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఓడించాలి

బయ్యారం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు నందగిరి వెంకటేశ్వర్లు, మోకాళ్ల మురళీకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని కంబాలపల్లిలో భిక్షం అధ్యక్షతన నిర్వహించిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు యాకన్న, రాంబాబు, రమేష్, చిన్న లింగన్న, క్రిష్ణ, చంద్రయ్య పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



పెద్దవంగర: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వేణుమాధవ్

పెద్దవంగర: మండలంలో ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే ప్రతీ ఒక్కరు ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎంపీడీఓ వేణుమాధవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శనివారం రైతు వేదికలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం 194 వార్డులకు గాను 25,409 మంది ఓటర్ల ఉన్నట్లు వెల్లడించారు.

తొర్రూరు: స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాస్ కోరారు. శనివారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు.. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎస్సై ఉపేందర్, ఎంపీఓ పూర్ణచందర్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పలు పార్టీల నాయకులతో ఎన్నికల నియమావళిపై సమావేశం నిర్వహించారు ఎన్నికల కోడ్ సందర్భంగా మండలంలో పోలీసుల పెట్రోలింగ్, వాహనాలు తనిఖీ ఉంటుందని ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగభవాని, ఎంఈఓ రవికుమార్ పాల్గొన్నారు.

బయ్యారం: స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని తహసీల్దార్ నాగరాజు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ఎంఈఓ దేవేంద్రాచారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దైవాధీనం పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించాలి

గార్ల: ఏజెన్సీ మండలాల్లో బీసీ, ఎస్సీలకు జనాభా ప్రాతిపదికన ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వార్డుల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బీసీ, ఎస్సీ వర్గాల నాయకులు శుక్రవారం ఎంపీడీఓ మంగమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని చెప్పి ఏజెన్సీ మండలాల్లో బీసీ, ఎస్సీ కులాలకు రిజర్వేషన్లు కల్పించడంలో పూర్తిగా విస్మరించారని వారు ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ, ఎస్సీ కులాల నాయకులు కందునూరి శ్రీనివాసరావు, కట్టెబోయిన శ్రీనివాస్, ఈశ్వర్‌లింగం, రాధాకృష్ణ, తోడేటి శ్రీను, విశ్వ, వెంకన్న, మీగడ శ్రీనివాస్, తాళ్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సంఘాల నాయకులు

స్థానిక ఎన్నికల పోరులో 'మాస్‌లైన్'



మాట్లాడుతున్న చిన్న చంద్రన్న

నెహ్రూసెంటర్: రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల పోరులో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ బరిలో నిలుస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాయం చిన్న చంద్రన్న పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీతి నిజాయితీగా పేదల సంక్షేమం కోసం పోటీ చేస్తున్న విప్లవకారులను గెలిపించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదు జెడ్పీటీసీ స్థానాలు, 15ఎంపీటీసీ స్థానాలు, 20సర్పంచ్ స్థానాల్లో పోటీ చేసేందుకు పార్టీ నిర్ణయించిందన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి, పూనెం ప్రభాకర్, ముంజంపల్లి వీరన్న, సత్యం, నర్సింహారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని పాతబజారులో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ సంగీత శనివారం తెలిపారు. 11కేవీ విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని నందినగర్, గుండ్లకుంట కాలనీ, స్తూపం కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఎల్‌బీజీ నగర్, రాహుల్‌నగర్, ఏటిగడ్డతండా, రామచంద్రాపురం కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, బతుకమ్మ విగ్రహం ఏరియా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అంబేడ్కర్ కాలనీ, ఈదులపూసపల్లి రోడ్‌లో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

వైభవంగా దుర్గాదేవి నిమజ్జన ఊరేగింపు



నెల్లికుదురు: చిన్ననాగారంలో..



కురవి: కందికొండలో..



గూడూరు: సాయిబాబా వీధిలో వేడుకలో పాల్గొన్న భక్తులు



చిన్నగూడూరు: మండల కేంద్రంలో..



డోర్నకల్‌లో దుర్గామాత ఊరేగింపు..

పలు గ్రామాల్లో శనివారం దుర్గామాత శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. శరన్నవరాత్రుల పూజలందుకున్న దుర్గామాత విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేశారు. - సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్త సమాచారం

ఓటు హక్కును వినియోగించుకోవాలి

గార్ల: జిల్లాలో త్వరలో జరుగనున్న స్థానిక ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటుహక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని జిల్లా కళాజాతా బృందం శనివారం గార్ల నెహ్రూసెంటర్‌లో పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు కొమిరె వెంకన్న, రాజమౌళి పాల్గొన్నారు.

దాతలు సహకరించాలి

డోర్నకల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమయ్యే వసతుల కల్పనకు దాతలు సహకరించాలని డోర్నకల్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం బండి నర్సింహారావు కోరారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టూడెంట్ వెల్ఫేర్ ఫండ్‌కు శనివారం రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, సాహెబ్‌అలీ, విద్యాసాగర్, మంజులత, కమల, అమీనాబేగం పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

కురవి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఆమెడ సత్యం అనే రైతుకు చెందిన గడ్డివామి శనివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను ఆర్పేందుకు కృషి చేశారు. అప్పటికే వామి పూర్తిగా దగ్ధమైంది. రూ.లక్ష నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఆర్థికసాయం

దంతాలపల్లి: మండలంలోని బొడ్లాడ గ్రామానికి చెందిన పులి రాజు(32) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు శంకరబోయిన సురేందర్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశాడు.

ఎంపీటీసీ అభ్యర్థులపై అభిప్రాయ సేకరణ

కురవి: మండల కేంద్రంలోని రెండు ఎంపీటీసీలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థుల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజేందర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రెండు ఎంపీటీసీ స్థానాల నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థుల పేర్లను తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అవిరె మోహన్‌రావు, బాలగాని శ్రీనివాస్, డాక్టర్ దడిగల శరత్, బానోత్ తుకారం నాయక్, దైద భద్రయ్య పాల్గొన్నారు.

సంతాపం

డోర్నకల్: డోర్నకల్‌కు చెందిన గండి సుభద్ర(80) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. సాక్షి చానల్ డోర్నకల్ రిపోర్టర్ గండి సీతారాం తల్లి సుభద్ర కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. నాయకులు, జర్నలిస్టులు సుభద్ర మృతికి నివాళులర్పించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



మహబూబాబాద్ రూరల్: మండలంలోని దామ్య తండా గ్రామంలో నిర్వహించిన మండలస్థాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ప్రథమ బహుమతి విజేతగా దామ్య తండా బాయ్స్ యూత్ టీం నిలువగా ద్వితీయ బహుమతి విజేతగా మానుకోట బాబునాయక్ తండా టీం నిలిచాయి. కిసాన్ పరివార్ అధినేత భూపాల్ నాయక్ బహుమతులు అందజేశారు. మీరాదామునాయక్, మహబూబ్ పాషా, చిమ్నానాయక్, లింగ్యానాయక్ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండల జెడ్పీటీసీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ రెడ్యాల, కంబాలపల్లి గ్రామాలకు చెందిన నర్సింగ శ్రీనివాస్, బెల్లంకొండ శ్రీనివాస్ శనివారం పార్టీ పెద్దలను కోరారు. ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, తదితరులను మర్యాదపూర్వకంగా కలిసి బయోడేటా అందజేసి తమకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

6న సన్నాహక సమావేశం

చిన్నగూడూరు: ఈనెల 6న మండల కేంద్రంలో నిర్వహించే బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు డీఎస్ రాంసింగ్ శనివారం తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



గూడూరు: మండలంలోని మర్రిమిట్ట శివారు బందాలగడ్డతండాలో శనివారం ఓ పాడి గేదె విద్యుదాఘాతంతో మృతిచెందినది. రైతు బానోతు వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఓ రైతు వ్యవసాయ బావికి విద్యుత్ మోటార్ సరఫరా కోసం అమర్చిన వైర్ తెగి కిందపడింది. అటుగా మేతకు వెళ్లిన పాడి గేదె వైర్‌ను తాకి అక్కడికక్కడే మృతి చెందింది.

టీ షర్ట్స్ అందజేత

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులకు కాంగ్రెస్ మండల నాయకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో టీషర్ట్స్‌ను శుక్రవారం రాత్రి అందజేశారు. ముందుగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విగ్రహం ఆవిష్కరణ

కేసముద్రం: కేసముద్రం పట్టణానికి చెందిన నర్సింగం రాజలింగం వర్ధంతి సందర్భంగా, అతని విగ్రహన్ని తమ పంట చేను వద్ద కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈమేరకు శనివారం రాజలింగం విగ్రహాన్ని కుటుంబ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐలమ్మ, జనిగల రమేష్, హైమా, మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం ప్రాథమిక పాఠశాలలో 2004–05 సంవత్సరంలో ఐదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు అనంతారం ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గుగులోతు కిషన్ నాయక్, హెచ్‌ఎం అనిత, పూర్వ విద్యార్థులు సింధూజ, కృష్ణవేణి, యమునా, కల్యాణి, సౌజన్య స్వప్న, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.